సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



రౌడీషీటర్ హత్య కేసులో ఐదుగురి అరెస్ట్


రౌడీషీటర్ పొలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య కేసులో అమలాపురం పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. - 8లో▸



అంతర జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అనేక చోరీలకు పాల్పడిన నలుగురు సభ్యుల అంతర జిల్లాల దొంగల ముఠాను ఆత్రేయపురం పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 4,08,369 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 4,500, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.10, భద్రాచలం వద్ద 30.60 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

నాడు-నేడు పనుల్లో జాప్యంపై హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

కపిలేశ్వరపురం: మండలంలోని అద్దంకివారి లంక గ్రామ శివారు కోరుమిల్లిలంకలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.ప్రేమసుందరానికి జిల్లా విద్యా శాఖాధికారి ఎం.కమలకుమారి షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత విద్యా సంవత్సరంలో నాడు-నేడు పథకంలో రూ.5 లక్షలు నిధులు మంజూరు కాగా కొంత మేర పనులను పూర్తి చేశారు. వేసవి సెలవులు, అనంతరం పాఠశాలకు నూతన హెచ్‌ఎం రావడంతో పనులు పునరుద్ధరణ కాలేదు. సామగ్రి, నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు చేవట్టడంలేదంటూ పాఠశాల పీఎంసీ చైర్మన్, సభ్యులు జిల్లా అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేశారు. డీఈఓ కమలకుమారి శుక్రవారం ఎంఈఓ కె.తాతారావుతో కలిసి పాఠశాలను సందర్శించారు. పనులను పునరుద్ధరించకపోవడంపై హెచ్‌ఎం తీరుపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని డీఈఓ కమలకుమారి తెలిపారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ తదితరులున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దొరబాబు



అమలాపురం రూరల్/అల్లవరం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు యాళ్ల దొరబాబును నియమించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దొరబాబు పనిచేస్తున్నారు. గతంలో రాష్ట్ర కార్యదర్శిగా, అల్లవరం మండల జెడ్పీటీసీగా ఉమ్మడి రాష్ట్రాల పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, సర్పంచ్‌గా, ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. జిల్లాలో పార్టీని పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా దొరబాబు నియామకం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

లోకేష్ పాదయాత్రకు బందోబస్తు : ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: టీడీపీ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంబంధించి జిల్లాలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుసరాపు శ్రీధర్ తెలిపారు. ఇప్పటికే జిల్లా టీడీపీ నాయకులు ఇచ్చిన లోకేష్ పాదయాత్ర షెడ్యూల్‌కు అనుగుణంగా ఆ రూట్లలో అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దింపామన్నారు. లోకేష్ పాదయాత్ర బందోబస్తు విషయమై టీడీపీ నాయకులు ఎస్పీని శుక్రవారం కలిసి చర్చించారు. అనంతరం ఎస్పీ ఆ బందోబస్తు వివరాలను విలేకర్లకు వివరించారు. ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం, కవ్వింపు చర్యలకు అవకాశం లేకుండా యాత్ర సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

కొత్తపేట సచివాలయం - 4 లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఇందిరాభారతి, సిబ్బంది (ఫైల్)



ప్రభుత్వ లక్ష్యం మేరకు తక్షణ చర్యలు



ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో తక్షణ చర్యలు చేపట్టాం. మండల స్థాయిలో సమీక్షా సమావేశాలకు ఆదేశించాం. నెల రోజుల్లోగా అన్ని సచివాలయాల్లో వైద్య శిబిరాలు పూర్తికావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకనుగుణంగా చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, అమలాపురం

పేదల క్షేమానికి జగనన్న ఆరోగ్య సురక్ష



- ఈ నెల 30 నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు
- 15 నుంచి వలంటీర్ల ఇంటింటి సర్వే
- ఇళ్ల వద్దకే వచ్చి వైద్య పరీక్షలు.. అదే గ్రామంలో వైద్య శిబిరాలు
- అవసరమైన రోగులకు పెద్ద ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం
- వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో మరో మైలురాయి

కొత్తపేట: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' వైద్య సేవలు కొనసాగుతుండగా వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో మరో గొప్ప కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదే 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం. దీని ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుంది. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైనవారికి గ్రామాల్లోనే క్యాంపులు నిర్వహించి వైద్యం అందించడం, పెద్ద ఆస్పత్రులకు సిఫారసు చేయడం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఈ నెల 15న వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలను కలిసి, ఇంట్లో ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి ఏఎన్‌ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారు. 16 నుంచి ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికీ వస్తారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అదే గ్రామం, వార్డు సచివాలయాల్లో ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిబిరాలు జరిగే సమయానికి అందరికీ ఆరోగ్య నివేదికలను ఏఎన్ ఎంలు, సీహెచ్‌వోలు సిద్ధం చేసి ఉంచుతారు. ఈ వైద్య శిబిరాలకు స్పెషలిస్టు డాక్టర్లు ఇద్దరు, ఆ మండలంలోని పీహెచ్‌సీ డాక్టర్లు ఇద్దరు రోగులకు అక్కడికక్కడే చికిత్స అందజేస్తారు. ఆరోగ్య సలహాలు సూచనలు ఇస్తారు. అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స కోసం సిఫారసు చేస్తారు.

ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల నుంచి కూడా డాక్టర్లు

ఈ క్యాంపునకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి కూడా ఒక స్పెషలిస్టు డాక్టర్ హాజరవుతారు. నెల రోజులపాటు ప్రతి రోజూ ఈ క్యాంపులు నిర్వహిస్తారు. మండలానికి ఒక గ్రామం చొప్పున జిల్లా వ్యాప్తంగా రోజూ వైద్య శిబిరాలు కొనసాగుతాయి. దీని వల్ల గ్రామాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వారి గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో సత్వర వైద్యం అందుతుంది. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఇది ప్రభుత్వం కల్పిస్తున్న గొప్ప సదుపాయం.

పక్కా ప్రణాళికతో..

ఈ శిబిరాలను 30 రోజుల వ్యవధిలో అన్ని గ్రామాల్లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. సెప్టెంబర్ నెలాఖరుకు తొలి శిబిరం ప్రారంభిస్తారు. వచ్చే నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ పూర్తవుతుంది. అన్ని గ్రామాల్లో పాఠశాలలు, కాలేజీలు, సచివాలయాల ప్రాంగణాలు, యూపీహెచ్‌సీ ప్రాంగణాలు.. ఇలా ఎక్కడ అనుకూల వసతులు ఉంటే అక్కడ ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. తొలుత వలంటీర్లు ఇంటింటికీ వస్తారు. ఆరోగ్యశ్రీ వివరాలతో కూడిన కిట్‌లను అందజేస్తారు. ఆ కిట్‌లో ఆరోగ్యశ్రీ కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవల వివరాలతోపాటు, నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల జాబితా ఉంటుంది. ఇంట్లో ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని వలంటీర్లు గుర్తించి ఏఎన్‌ఎంలు ఇళ్లకు వచ్చే షెడ్యూల్, చేసే పరీక్షలు, క్యాంపు నిర్వహించే తేదీ తదితర వివరాలను వెల్లడిస్తారు.

అందుబాటులో మందులు, వైద్య పరికరాలు

వైద్య శిబిరం జరుగుతున్న ప్రతి చోటా 105 రకాల ఔషధాలు అందుబాటులో ఉంటాయి. అన్ని రకాల వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మెడికల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. పూర్తిస్థాయిలో అందరూ పని చేయాలని, ఆయా విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వం ఆదేశించింది.

మూగవేదన



డ్రైనేజీలో కూరుకుపోయిన గేదె

రాయవరం: గ్రామంలో శుక్రవారం ఓ గేదె డ్రైనేజీలో పడి మూడున్నర గంటలపాటు నరకయాతన పడింది. స్థానిక రైతు బదరీల రెడ్డి పశువులను మేతకు తీసుకు వెళ్తుండగా గేదెలు ఒకదానికొకటి కొమ్ములు విసురుకోవడంలో ఒక గేదె డ్రైనేజీలో పడిపోయింది. భారీసైజులో ఉన్న కాయంతో ఉన్న గేదె డ్రైనేజీలో పడిపోవడంతో బయటకు రావడం కష్టమైంది. దీంతో డ్రైనేజీ గట్టును తొలగించారు. కానీ బయటకు తీయడం కష్టమైంది. దీంతో చేసేది లేక జేసీబీని రప్పించి డ్రైనేజీ నుంచి మూడున్నర గంటల అనంతరం బయటకు తీశారు. ఈ సమయంలో ఆ గేదె తీవ్ర నరకయాతను అనుభవించింది. బయటకు తీసిన అనంతరం గేదె క్షేమంగా ఉంది. దీంతో రైతు బదరీల రెడ్డి, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

17కు సివిల్ సర్వీసెస్ టోర్నీ ఎంపికలు వాయిదా

అమలాపురం రూరల్: రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో క్రికెట్‌కు సంబంధించి ఆదివారం ఏసీఏ మూలపాడు స్టేడియంలో జరగవలసిన ఎంపికలు ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పి.సురేష్‌కుమార్ తెలిపారు. అనుకూల వాతావరణ పరిస్థితులు లేనందున ఈ ఎంపికలు 17న గుంటూరు జిల్లా మంగళగిరి ఏసీఏ స్టేడియంలో జరుగుతాయని విజయవాడ ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారని ఆయన తెలిపారు. కోనసీమ జిల్లాకు చెందిన ఉద్యోగస్తులు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి ఎంపికలలో పాల్గొంటున్న క్రికెట్ క్రీడాకారులందరూ గమనించవలసిందిగా కోరారు.

యువగళం ఫ్లెక్సీల ఏర్పాటులో విభేదాలు

- తాటిపాక సర్పంచ్‌పై దాడి
- పోలీసులకు ఫిర్యాదు



తాటిపాకలో సర్పంచ్ రత్నమాల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేసిన దృశ్యం

రాజోలు: యువగళం పాదయాత్ర పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ టీడీపీలో విభేదాలు బయట పడ్డాయి. టీడీపీ నేత నారా లోకేష్‌కు స్వాగతం పలికేందుకు తాటిపాక కూడలిలో గ్రామ సర్పంచ్ కోటిపల్లి రత్నమాల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో రాజోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు ఫొటో వేయకపోవడంపై ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎప్పుడూ ఫ్లెక్సీలు పెట్టే చోట పెట్టడమే కాకుండా తమ నాయకుడు గొల్లపల్లి ఫొటో లేకపోవడంతో కోపోద్రిక్తులైన వారు సర్పంచ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. ఫ్లెక్సీని తొలగిస్తున్నప్పుడు గొల్లపల్లి వర్గీయులను సర్పంచ్ రత్నమాల అడ్డుకున్నారు. ఈ క్రమంలో తనతో ఘర్షణకు దిగి, ఫ్లెక్సీలు చించివేసి, తనపై దాడికి పాల్పడ్డారంటూ సర్పంచ్ రత్నమాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచీ మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, ఆయన అనుచరులైన నాగిరెడ్డి గోపి, ఉలంపర్తి భాస్కరరావు, కట్టా భగవాన్, సీహెచ్ సంతోష్, గుబ్బల విక్రమ్ తన విధులకు అడ్డు తగులుతున్నారని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఇటీవల సర్పంచ్ రత్నమాలను సస్పెండ్ చేశామని ఆ పార్టీ మండల యూత్ కన్వీనర్ నాగిరెడ్డి గోపి తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి లేకుండా ఫ్లెక్సీలే వేయవద్దని, పార్టీలో విభేదాలు సృష్టించవద్దని చెప్పినా సర్పంచ్ రత్నమాల పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం

జేసీ నుపూర్ అజయ్

రామచంద్రపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించే విధంగా కార్యక్రమం చేపట్టిందని, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం రామచంద్రపురం మండల స్థాయి కార్యక్రమంలో 60 అర్జీలను జేసీ నుపూర్ అజయ్, ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించే ఉద్దేశంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కంటే మెరుగ్గా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ఈ రెండు కార్యక్రమాల నిర్వహణ పట్ల జిల్లాస్థాయి అధికారులు మరింత ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్ చేస్తారని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధి, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా, ఏవైనా అవాంతరాలు ఎదురైనా అర్జీదారులు ఫిర్యాదులు చేస్తారని, వాటి పరిష్కారంపై సకాలంలో దృష్టి సారించాలని సూచించారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుందన్నారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతోపాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా జిల్లా స్థాయి అధికారులు నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తూ రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా వినతుల పరిష్కారం ఉండాలన్నారు.



జగనన్నకు చెబుదాం రామచంద్రపురం మండల స్థాయి కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ, ఆర్డీవో

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, నోడల్ అధికారి భీమేశ్వరరావు, డీఎస్ఓ ఎ.పాపారావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, రామచంద్రపురం పురపాలక సంఘ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తహసీల్దార్ తారకేశ్వరరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రుణ ప్రణాళిక అమలు భేష్

ఎంపీ అనురాధ, జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బ్యాంకులు రుణాలు మంజూరు చేయడంలో సాధించిన ప్రగతి అభినందనీయమని ఎంపీ చింతా అనురాధ, ఇన్‌చార్జి కలెక్టర్ నూపుర్ అజయ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంకుల జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ అధ్యక్షతన జరిగింది. 2023–2024 వార్షిక రుణ ప్రణాళిక కింద జిల్లాలోని బ్యాంకులు వివిధ గవర్నమెంట్ పథకాలకు జూన్ 30 వరకు అందించిన రుణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ కలెక్టర్ నూపుర్ అజయ్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి రూ.12,209 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా మొదటి క్వార్టర్‌లోనే రూ.4,205 కోట్లు (34.44 శాతం) బ్యాంకులు అందించాయని తెలిపారు.

కోనసీమ జిల్లాలో కౌలు రైతులను అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్‌గా గుర్తించి పంట రుణాలు ఇచ్చే కార్యక్రమం విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలో 1,028 మంది రైతులకు రూ.5.46 కోట్లు రుణాలుగా అందించడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ రుణాలలో సీసీఆర్సీ కార్డులు ఉన్న రైతులకు ఇచ్చే రుణాల మీద ఎక్కువ దృష్టి సారించాలని బ్యాంకర్లకు సూచించారు. జగనన్న తోడు, టిడ్కో గృహాల నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన రుణాల లక్ష్యాలను ఈ సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీన 18 రకాల చేతి వృత్తిదారుల కోసం విశ్వకర్మ యోజన ప్రారంభిస్తుందని చెప్పారు. ఈ పథకం కింద పూచీకత్తులేని రుణంగా మొదటి విడతలో 5 శాతం వడ్డీతో ఒక లక్ష రూపాయలు అందిస్తుందని, రెండవ విడతలో రెండు లక్షల రూపాయలు రుణాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఎక్కువమంది చేతి వృత్తిదారులు లబ్ధి పొందేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు సూచించారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ అనురాధ, నూపుర్ అజయ్

ఎంపీ చింత అనురాధ మాట్లాడుతూ మొత్తంగా జిల్లాలోని బ్యాంకులు బాగా పనిచేస్తున్నాయని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల కోసం పూచీకత్తు లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, బడుగు బలహీన వర్గాలలోని యువతను చిన్న పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని బ్యాంకర్లను సంబంధిత అధికారులను కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ రంగారావు, ఆర్‌బీఐ ఎల్డీఓ అనిల్, నాబార్డ్ డీడీఎం సోము నాయుడు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.శ్యాంబాబు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, అగ్రికల్చర్ జేడీ బోసుబాబు, బ్యాంకు మేనేజర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

- ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కన్నుల పండువగా నిర్వహణ
- పాల్గొన్న మంత్రి వేణు దంపతులు
- పోటెత్తిన 6 వేల మందికి పైగా మహిళలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆరు వేల మందికి పైగా మహిళలు ఈ వ్రతాల్లో పాల్గొనగా అందుకు తగిన విధంగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వరలక్ష్మీ అమ్మవారిని ప్రతిష్ఠించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, వరలక్ష్మీ దంపతులు, దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు, పలువురు ప్రజాప్రతినిధులు వ్రతాల్లో పాల్గొన్నారు. పూజా సామగ్రితో పాటు చీర, రవిక, వరలక్ష్మీ రూపు దేవస్థానం సమకూర్చింది. ఆలయ అర్చకులు కళ్లేపల్లి విశ్వప్రకాశ్ నారాయణశర్మ, మద్దిరాల రఘునందన్ శర్మ, స్వస్తి వాచకులు ఇంద్రగంటి ఆంజనేయశర్మ, మైలవరపు శ్రీమన్నారాయణ శర్మ, దేవులపల్లి ఫణి రామకృష్ణ శర్మ, వేద పండితులు బులుసు శివరామకృష్ణ శర్మ, తుట్టగుంట సతీష్‌శర్మ, కామంచి రామజోగి రాజేశ్వరశాస్త్రిల బ్రహ్మత్వంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి వ్రతాన్ని శాస్త్రోక్తంగా మహిళలు నిర్వహించుకున్నారు. అనంతరం దాత సత్తి సుబ్బారెడ్డి, ఆయన కుమారులు సత్తి సూర్యనారాయణరెడ్డి, సత్తి సత్తిరెడ్డిల ఆధ్వర్యంలో ఆరు వేల మందికి అన్నదానం నిర్వహించారు.





ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళల్లో కొంతమంది. (అంతరచిత్రం) వేదికపై నుంచి భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి వేణు

తండోపతండాలుగా..

భీమేశ్వరాలయం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ కార్యక్రమానికి మహిళా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల కు చెందినవారు కూడా ముందుగా పంపిణీ చేసిన టోకెన్లు అందుకొని ఈ సామూహిక వ్రతంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందుకు దీటుగా ఏర్పాట్లు చేయడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

నవంబర్ 19న శెట్టిబలిజ కార్తిక వన సమారాధన


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు తదితరులు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 19న రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి శెట్టిబలిజ కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వన సమారాధన కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, నాయకులు పాల్గొంటారన్నారు. శెట్టిబలిజ సంఘీయుల భవిష్యత్తుపై చర్చించి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆ రోజున శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదిక కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాలపై ఇప్పటి నుంచి ప్రతి గ్రామం, మండలాల్లో శెట్టిబలిజ సామాజిక వర్గీయులను సమీకరిస్తామని వివరించారు. సమావేశంలో సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, జి.భాస్కర్, గుత్తుల గోపీనాథ్, బత్తిన ప్రసాద్ పాల్గొన్నారు.

GROUP-II 2nd Batch: 9-9-23
Online / Offline Coaching & Model Exams నిర్వహించబడును.
శ్యామ్ కాకినాడ 89847 43999

రామచంద్రపురం పురపాలక సంఘం
ఆర్.ఓ.సి.నెం. 24/23-ఇ1 తేది.08-09-2023
ఇ ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
రామచంద్రపురం పురపాలక సంఘం నందు పురపాలక సంఘ సాధారణ నిధులు, సి.ఎమ్.డి.ఎఫ్ నిధులు, మరియు జి.జి.ఎమ్.పి నిధులు నుండి 16 పనులు గాను రూ.65.65 లక్షల అంచనాలతో టెండర్లు పిలువబడినవి.
టెండర్ బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది. 08-09-2023 మ. గం॥ 3.00ల నుండి
ముగింపు తేది. 22-09-2023 సా. గం॥ 4.00 వరకు
మిగిలిన వివరములు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం// కె.శ్రీకాంత్ రెడ్డి
కమీషనరు
రామచంద్రపురం మున్సిపాలిటీ

టెండరు నోటీసు ఆర్.ఓ.సి.నెం.50/2023-ఇ1 ది.07-09-2023
మండపేట మున్సిపాలిటీ, మండపేట - ఇంజనీరింగు విభాగము - టెండరు నోటీసు
ఈ దిగువ సూచిపరించిన సరఫరాలు చేయుటకు సీలు వేసిన టెండర్లు మండపేట పురపాలక సంఘ కమీషనరు వారిచే లేక వారిచే అధికారము పొందిన వారిచే ఈ దిగువ సూచిపరించిన రీతిని టెండర్లు స్వీకరించబడును.

క్ర. సం.	పని వివరము	ధరావత్తు	షెడ్యూలు ఖరీదు	కాల పరిమితి
1	2023-24, 2024-25 మరియు 2025-26 అనగా 3 సంవత్సరముల కాలమునకు సంబంధించి మండపేట పురపాలక సంఘ పరిధిలో జరుగు వివిధ అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణములు పరిశీలించి 3వ పార్టీ క్వాలిటీ కంట్రోలు ఏజెన్సీకు ధృవపత్రము జారీచేయుట గురించి	5,000/-	1000/-	3 సంవత్సరములు

1. టెండర్లు స్వీకరించుటకు ఆఖరి తేది :- ది.15-09-2023 సాయంత్రం గం॥ 4.00ల వరకు
2. టెండరు షెడ్యూలు మరియు టెండరు ధరావత్తు చెల్లించుటకు ఆఖరి తేది :- ది.14-09-2023
3. టెండరు షెడ్యూలు జారీ చేయు తేది :- ది.15-09-2023
టెండర్లు ది.14-09-2023వ తేదీ సాయంత్రం గం.4.00ల వరకు స్వీకరించి అదే రోజు సాయంత్రం గం.4.30 ని॥లకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షమున లేక వారి ఏజెంట్ల సమక్షమున తెరువబడును. ఇతర వివరములకు ఆఫీసు పనివేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించవలెను.
సం/-టి.రామ్‌కుమార్, ఐ.ఆర్.ఎ.
కమీషనరు, మండపేట పురపాలక సంఘం

రౌడీషీటర్ హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

- కారు, రెండు మోటారు సైకిళ్లు, ఇనుప రాడ్లు స్వాధీనం
- ఎస్పీ శ్రీధర్ వెల్లడి


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా, డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: ఈదరపల్లి శ్మశానంలో రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య, అతని స్నేహితుడు అడపా సాయిపై హత్యాయత్నం కేసులో అయిదుగురు నిందితులను అమలాపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ హత్య కేసులో మరికొంతమందిని అరెస్ట్ చేసేందుకు తొమ్మిది పోలీసు ప్రత్యేక బృందాలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్వేషిస్తున్నాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో అరెస్ట్ చేసిన వారి పేర్లను, స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలను తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఈ హత్య, హత్యాయత్నం కేసులో నిందితులైన అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన బళ్ల సతీష్, అల్లవరం మండలం గూడాలకు చెందిన తాటికాయల శేష సుధీర్, కొప్పుల మణికంఠ, అడబాల వీరబాబు, అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన కోడూరి లోవ శివ కళ్యాణ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ శ్రీధర్ వెల్లడించారు. వీరి వద్ద నుంచి హత్య సమయంలో ఉపయోగించిన కారు, రెండు మోటారు సైకిళ్లు, ఇనుప రాడ్లు, రెండు సర్వే కర్రలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

హత్యకు ఇదీ నేపథ్యం

హత్యకు గురైన రౌడీషీటర్ కిషోర్ గత నెల 31వ తేదీ రాత్రి ఈదరపల్లిలో తన స్నేహితులతో కలిసి హత్య కేసులో నిందితుడైన బళ్ల సతీష్, అతని స్నేహితులపై చేయి చేసుకుని దౌర్జన్యం చేశాడు. ఇటీవల కాలంలో కిషోర్ ఆధిక్యం ఎక్కువ అవుతుందన్న అక్కసుతో బళ్ల సతీష్ తన బృందంతో చర్చించాడు. తన వాళ్లతో కలిసి కిషోర్‌ను హత్య చేసేందుకు పథకం పన్నాడు. దీంతో మర్నాడు ఈదరపల్లి శ్మశానంలో కిషోర్ హత్య, అతని స్నేహితుడు సాయిపై హత్యాయత్నం బళ్ల సతీష్, రౌడీ గ్యాంగ్ చేశారని దర్యాప్తులో తేలిందన్నారు. ఘటన అనంతరం నిందితులు పరారయ్యారు. ఈ రెండు రోజులు వారి మధ్య జరిగిన రౌడీగ్యాంగ్ వార్ మద్యం మత్తులో సాగిందని ఎస్పీ తెలిపారు.

రౌడీ గ్యాంగ్‌లు, గ్రూపులను అంతమొందిస్తాం

రౌడీషీటర్ హత్య, హత్యయత్నం జరగగానే శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దింపి పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చామని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. డీఐజీ అమలాపురంలో రెండు రోజులు మకాం చేసి శాంతి భద్రతలను స్వయంగా పర్యవేక్షించారు. ఇకపై రౌడీ గ్యాంగ్‌లు, గ్రూపులను పూర్తిగా అంతమొందించేందుకు ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

ఆ ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్నాం

హత్యకు ముందు రోజు ఈ కేసులో ప్రధాన నిందితుడైన బళ్ల సతీష్ గ్రామంలో రౌడీషీటర్ కిషోర్ అగడాలను అదుపు చేయాలని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై సకాలంలో చర్యలు తీసుకుని ఉంటే హత్య,హత్యాయత్నం జరిగి ఉండేది కాదన్న పబ్లిక్ టాక్‌పై పోలీసు శాఖ స్పందించింది. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిస్తున్నామని, ఇందులో తమ శాఖాపరంగా ఎవరిదైనా తప్పిదం ఉంటే చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు. హత్య తర్వాత అమలాపురంలో ఓ దుకాణం దగ్ధం, ఈదరపల్లిలో ఓ ఇల్లు ధ్వంసంపై నమోదైన రెండు కేసుల్లో కూడా నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ శ్రీధర్ చెప్పారు.

పెళ్లి ఇంట్లో భారీ చోరీ

- రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు దోపిడీ
- ఘటనా ప్రదేశంలో వేలిముద్ర నిపుణుల పరిశీలన

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో పెళ్లి ఇంట భారీ చోరీ జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం గురువారం రాత్రి వేట్లపాలెం గ్రామానికి చెందిన బిక్కిన వీరవెంకట సత్యనారాయణ కుమారుడు వివాహానికి కుటుంబ సభ్యులు రామచంద్రపురం మండలం చోడవరం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు వంటగది కిటికీ గ్రిల్స్ తొలగించి లోనికి ప్రవేశించారు. తెల్లవారు జామున ఇంటికి వచ్చే సరికి వంటగది కిటికీ తొలగించి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు తలుపు తీసి లోనికి వెళ్లేసరికి గది తలుపులు, బీరువా తెరచి ఉన్నాయి. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటి గది బీరువాలో బంధువులు, కుటుంబ సభ్యులకు చెందిన 35 తులాల బంగారు ఆభరణాలు, రూ.5.50 లక్షల నగదు దోచుకుపోయినట్టు గుర్తించారు. మొత్తం విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన ఫంక్షన్‌లో పెళ్లి కానుకలుగా వచ్చిన నగదుతో పాటు, పెళ్లి ఏర్పాట్లకు ఇవ్వవలసిన డబ్బును ఇంటిలో ఉంచామని సత్యనారాయణ తెలిపారు.


ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, వేలిముద్ర నిపుణుడు


గ్రిల్ తొలగించిన వంట గది కిటికీ

సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై టి.సునీత, వేలిముద్ర నిపుణులు ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడు వీరవెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ స్పర్జన్‌రాజు మృతి క్రీడారంగానికి తీరని లోటు

నివాళులు అర్పించిన పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు


స్పర్జన్‌రాజు భౌతిక కాయం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రంగరాయ వైద్య కళాశాల పీడీ, జిల్లా ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.స్పర్జన్‌రాజు మృతి జిల్లా క్రీడారంగానికి తీరని లోటని పలు క్రీడాసంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక సూర్యగ్లోబల్ ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. స్థానిక ఇన్‌కమ్‌టాక్స్ కాలనీలోని ఆయన స్వగృహంలో స్పర్జన్ రాజు భౌతిక కాయానికి క్రీడాసంఘాల ప్రతినిధులు, డాక్టర్లు, క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాగార్జున యూనివర్సిటీ నుంచి వ్యాయామ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన 2008 నుంచి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకునిగా సేవలు అందిస్తున్నారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. స్పర్జన్‌రాజు భార్య విజయలక్ష్మి శ్రీకాకుళం జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో డీఐజీగా పనిచేస్తున్నారు. కుమారుడు ఇంజినీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కుమార్తె ద్వితీయ సంవత్సరం డాక్టర్ విద్యను అభ్యసిస్తున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్శిటీ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు వరుసగా మూడుసార్లు రంగరాయ వైద్య కళాశాలలో విజయవంతంగా నిర్వహించడంలో స్పర్జన్‌రాజు కీలక పాత్ర పోషించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయి రిఫరీగా సేవలు అందించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పేపర్ ప్రెజంటేషన్ ఇచ్చారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి, జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రుగోవిందరాజు, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, డీఎస్ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్‌కుమార్ సంతాపం తెలిపారు. స్పర్జన్‌రాజు అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు కాకినాడ డైరీఫారమ్స్ సమీపంలోని సంజయ్‌నగర్ క్రైస్తవ శ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అంతర జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

- ఆత్రేయపురం పోలీసులకు చిక్కిన నలుగురు
- ఐదు జిల్లాల్లో 14 నేరాలు... ప్రధాన నిందితుడిపై 70 కేసులు
- ఎవరికీ అనుమానం రాకుండా కారులో మహిళతో సహా వచ్చి దోపిడీలు
- రూ.35 లక్షల సొత్తు స్వాధీనం
- ఎస్పీ శ్రీధర్ వెల్లడి


ఆత్రేయపురం పోలీసులు అరెస్ట్ చేసిన అంతర జిల్లాల దొంగల ముఠా

అమలాపురం టౌన్/ఆత్రేయపురం: రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అనేక చోరీలకు పాల్పడ్డ కరుడుగట్టిన, పోలీసులకు మోస్ట్ వాంటెడ్ అయిన నలుగురి సభ్యులతో కూడిన అంతర జిల్లాల దొంగల ముఠాను ఆత్రేయపురం పోలీసులు అరెస్ట్ చేశారు. తాను సహ జీవనం చేసే మహిళతో పాటు మరో ఇద్దరి దొంగల సహకారంతో కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన షేక్ అజీజ్ కారులో వచ్చి ఇళ్లల్లో చోరీలు చేస్తుంటాడు.

ముఠా పట్టుబడింది ఇలా..

ఆత్రేయపురం ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తన సిబ్బందితో బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ సమీపంలో పిచ్చుకలంక వద్ద గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ ముఠా కారును అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నించగా వారి సమాధానాలు తడబాటుగా ఉండడంతో వారిపై లోతైన దర్యాప్తు చేశారు. ఈ ముఠా అరెస్ట్, వారి నేరాల చిట్టా, స్వాధీనం చేసుకున్న రూ.35 లక్షల సొత్తు వివరాలను ఎస్పీ సుసరాపు శ్రీధర్ వెల్లడించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్‌బాషా, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం సీఐ రజనీకుమార్‌తో కలిసి ముఠా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చేసిన నేరాలు, చోరీల గురించి వివరించారు. ప్రధాన నిందితుడు అజీజ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం విజయనగరం జిల్లాల్లో తన ముఠాతో 14 చోరీలకు పాల్పడ్డాడు. అజీజ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 70 చోరీ కేసుల్లో నిందితుడు. ముఠా సభ్యులైన అజీత్‌తోపాటు రాజమహేంద్రవరానికి చెందిన యడ్ల ఉషా సూర్య వెంకట రాకేష్, కపిలేశ్వరపురం మండలం తాతపూడికి చెందిన కాండ్రేగుల శ్రవణ్ కృష్ణ, కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన ముసివాడ గౌరీ మల్లేశ్వరిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ శ్రీధర్ తెలిపారు. రాకేష్ ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా పరిధిలో 38 కేసుల్లో నిందితుడు. శ్రవణ్ కృష్ణ 13 నేరాల్లో, గౌరీ మల్లేశ్వరి 14 నేరాల్లో నిందితులు. ఈ నలుగురు దొంగిలించిన బంగారు నగలు, వెండి వస్తువుల్లో కొన్ని రాజమహేంద్రవరంలో కరిగించి ముద్దగా తయారు చేయించి దాచుకున్నారు. వ్యసనాలకు అలవాటు పడ్డ ఈ ముఠా అవసరం వచ్చినప్పుడు వీరు కారులో నర్సాపురం వెళ్లి వాటిని అమ్ముకుందామన్న ఉద్దేశంతో బయలుదేరి పిచ్చుకలంక వద్ద రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వాహనాల తనిఖీల్లో దొరికిపోయారు.

ఏ పోలీసు స్టేషన్‌లో ఎన్నెన్ని కేసులు

ఈ ముఠా ఆత్రేయపురం పోలీసు స్టేషన్ పరిధిలో 2, ఆలమూరు స్టేషన్ పరిధిలో 3, అంగర పరిధిలో 2, కాకినాడ పరిధిలో 1, కోటనందూరు పరిధిలో 2, ఎస్.రాయవరం పరిధిలో 1, మాకవారిపాలెం పరిధిలో 1, పీఎంపాలెం పరిధిలో 1, విజయనగరం రూరల్ పరిధిలో 1 వంతున 14 చోరీలకు పాల్పడింది. ఈ ముఠా నుంచి మొత్తం రూ.35 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 542.308 గ్రాముల బంగారు నగలు, 5.551 కిలోల వెండి వస్తువులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి నాలుగు నెలల జైలు, రూ.4.50 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్.ఉషాలక్ష్మికుమారి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన సత్తి గణపతిరెడ్డి వద్ద నుంచి అదే ప్రాంతానికి చెందిన సబ్బు త్రిమూర్తులు 2016లో రూ.4.50 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2019లో రూ.4.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. చెక్కును గణపతిరెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో త్రిమూర్తులుపై నేరం రుజువు కావడంతో నాలుగునెలల జైలు, రూ.4.50 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు 17కి వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న జరగాల్సిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కె.స్పర్జన్‌రాజు శుక్రవారం కాకినాడలో మృతి చెందడంతో శనివారం జరగాల్సిన ఎంపికలు వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆక్వా రంగాన్ని ప్రోత్సహించాలి

- హోంమంత్రి తానేటి వనిత
- సీఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం


స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, ఆకుల వీర్రాజు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సీఫుడ్‌ను విరివిగా తీసుకుని ఆక్వా రంగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో, భూమి ఆర్గానిక్స్ సంస్థ సహకారంతో నగరంలోని మంజీర కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నాలుగో ఆక్వా – సీఫుడ్ ఫెస్టివల్‌ను శుక్రవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. మత్స్య ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలతో తయారు చేసిన ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి.

మత్స్య ఉత్పత్తుల ఎగుమతిలో ప్రథమస్థానం

మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపద వినియోగాన్ని పెంచడం, అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలను విస్తృత పరిచే లక్ష్యంతో సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారన్నారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో చేపల ఉత్పత్తి ఎక్కువగా ఉందని, అయితే వాటిపై అవగాహన లేకపోవడం వల్ల వినియోగం తక్కువగా ఉంటోందన్నారు. మరో రెండు రోజుల పాటు జరిగే సీఫుడ్ ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిష్ ఆంధ్రా అనే బ్రాండ్‌ను మరింతగా ప్రచారం చేయాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి వినియోగదారుల్లో మరింత అవగాహన పెంచేలా చేయడమే ఈ ఫెస్టివల్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ఆక్వారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటునందిస్తున్నారన్నారు. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్లు, మొబైల్ వాహనాలను ప్రోత్సహించి, సబ్సిడీపై అందించడం ద్వారా ఆయా రంగాలపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు.

ప్రొటీన్లు అధికం

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ సముద్ర ఉత్పత్తుల్లో కొవ్వు పదార్థాలు తక్కువగా, ప్రొటీన్లు అధికంగా ఉంటాయన్నారు. ఫిష్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. జపాన్, కొరియా తదితర దేశాల్లో ప్రజలు సీఫుడ్స్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్నారని తెలిపారు. మనదేశంలో మాత్రం తక్కువ స్థాయిలో ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీసీఎంఎస్ చైర్ పర్సన్ సాకా మణికుమారి, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, హితకారిణి సమాజం చైర్ పర్సన్ కాశి మునికుమారి, భూమి ఆర్గానిక్స్ సంస్థ ప్రతినిధి రఘురామ్, మెరైన్ జేడీ వీవీ రావు, రాజానగరం మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కాన్ పరిశోధన సంస్థతో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం


ఒప్పంద ప్రతాలను చూపుతున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ప్రొఫెసర్ మహీంద్ర సుందర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అమెరికాలోని ప్రఖ్యాత లూయిస్‌విల్లె విశ్వవిద్యాలయానికి చెందిన కాన్ పరిశోధనా సంస్థతో ప్రభుత్వ అటానమస్ కళాశాల పరిశోధనా విద్యకు సంబంధించిన అంశాలపై అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో త్రీ సింగిల్ మేజర్ సబ్జెక్టులుగా భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం, భూగర్భ శాస్త్రం, కంప్యూటర్ సైన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, మెటీరియల్ సైన్స్‌లో నాలుగు సంవత్సరాల కోర్సును అందిస్తున్నామన్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జియాలజీ రెండేళ్ల కోర్సును అందిస్తున్నామన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు కాన్ పరిశోధనా సంస్థ అందజేసే 'న్యూ ఎనర్జీ టెక్నాలజీస్' అనే ఒక సంవత్సరం కోర్సుకు అర్హులన్నారు. దీనిపై కాన్ పరిశోధనా సంస్థ' డైరెక్టర్ ప్రొఫెసర్ మహీంద్ర సుందర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసి పరస్పరం అందిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గౌతమ్, డాక్టర్ ఈసూబ్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- రెండు వాహనాల డ్రైవర్‌ల అరెస్ట్
- కేసుల నమోదు


అధికారులు పట్టుకున్న మినీ వాహనం


స్వాధీనం చేసుకున్న లారీ

నల్లజర్ల: రెండు వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న 27.6 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సివిల్ సప్లయి డీటీ ఎ.సత్యనారాయణరావు విలేకరులకు తెలిపారు. కృష్ణాజిల్లా బావులపాడు మండలం బండారుగూడెం నుంచి తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలుకు మినీ వాహనంలో రవాణా అవుతున్న 3టన్నుల 9క్వింటాళ్ల 50కిలోల బియ్యాన్ని హైవేపై పుల్లలపాడు సచివాయం సమీపంలో పట్టుకున్నారు. డ్రైవర్ కోలామణి మణికంఠ కుమార్‌ను అరెస్ట్ చేశారు. వాహనాన్ని పోలీసులకు అప్పగించారు.

చెన్నై నుంచి కాకినాడ బీటో ఇంటర్‌నేషనల్ ఎక్స్‌పోర్టు సంస్థకు లారీలో రవాణా అవుతున్న 23టన్నుల 6క్వింటాళ్ల 60కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ తల్లగుంట ప్రైమ్ కుమార్‌ను అరెస్ట్ చేసి లారీని పోలీసులకు అప్పగించారు. ఈ లారీలో పీడీఎస్ బియ్యంతో పాటు మరో 5టన్నుల 110కిలోల బాయిల్డ్ రైస్ ఉన్నాయి. ఈ రెండు వాహనాలపై 7(1), రవాణాదారులపై 6(ఏ)కేసులు నమోదు చేశారు. ఈ దాడిలో సివిల్ సప్లయి డీటీ ఏ.సత్యనారాయణ రావు, వీఆర్వోలు లక్ష్మణమూర్తి, రాంబాబు, వీఆర్ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education
DISTANCE EDUCATION
■ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్ రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిలయిన వారికి కట్టుకునే అవకాశం. డిగ్రీ & పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, B.Li.Sc. నాగార్జున, ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీల ఎగ్జామ్స్ అన్నీ మా కాకతీయ విద్యాసంస్థలలో జరుగును. 100% పాస్. అడ్మిషన్లు జరుగుచున్నవి. కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, రాజమండ్రి, ఆత్రేయపురం. ఫోన్ : 99494 82757, 98495 82043 [V-2109]

Real Estate
FLAT FOR SALE
■ 2BHK Deluxe Flats Near 4th Bridge, Konthamuru, RJY, 100% Vastu, Loan Available, Just Call: Ph: 8686670009, 9390116370 [HA-903]

LAND FOR SALE
■ కాజులూరు మండలం, తనుకువాడ గ్రామంలో రోడ్డుకు చేర్చి 2 ఎకరాలు పంట పొలం అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9701379170, 9491438548 [G-7589]

TO-LET
■ "Kakinada" : Newly constructed 3BHK (1650 Sft) for Commercial/ Residential Near Karanam gari Center, Mehar Nagar, KAKINADA. Contact 81211 30200 / 99515 98518 [R-1927]

Services
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్క్రాప్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

BUSINESS OFFER

■ 18 సం॥ + పై బడి ఉన్నవారికి చదువుతో సంబంధం లేకుండా రోజుకు 2-3 గంటలు వర్క్ చేస్తూ నెలకు రూ.15,000/- సంపాదించే అద్భుత అవకాశం. ఫోన్ : 86399 09155, 84999 08944 [V-3167]

Wanted
■ రాజమండ్రిలో అమెజాన్ ప్రొడక్ట్స్ డెలివరీ చేయడానికి పురుషులు, మహిళలు కావలెను. "జీతం + పెట్రోల్ + ఇన్సెంటివ్" ఇవ్వబడును. ఆండ్రాయిడ్ ఫోన్, బైక్ లైసెన్స్ కావలెను. ✆ : 094919 72983, 095531 38616 [R-6138]
■ రాజమండ్రి-లాలాచెరువు వాటర్ వాష్‌లో పని చేయుటకు ఆడ, మగ కావలెను. మరియు మెకానిక్స్, అకౌంటెంట్స్, టెలి కాలర్స్ కావలెను. గోపాల్ ఆటోమోటివ్స్. ✆ : 95814 22555 [R-6139]
■ RJY మందుల షాపులో పనిచేయుటకు 1 సం॥ అనుభవం, మందుల గురించి తెలిసిన వ్యక్తి (ఫార్మసిస్ట్) కావలెను. Cont: శ్రావంతి, డెంటల్స్, బొమ్మూరు ✆ : 96766 42044 [R-935]
■ హైదరాబాదులో ఆప్తా ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. Age 21-45 వేలు జీతం॥ 15 వేల ఆపైన, భోజన వసతి ఇన్సూరెన్స్ సౌకర్యం కలదు. ఆసక్తి కలవారు సంప్ర॥ 81066 28388 [G-1112]
■ కన్సల్టెన్సీ కాదు. VIPఇండ్లలో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్+భోజనం. HYD Ph: 8919613984 [H-589]
■ ప్రముఖ MNC కంపెనీలో పనిచేయుటకు ఫుల్/ పార్ట్‌టైం (M/F) సేల్స్‌మేనేజర్స్ మరియు డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. అర్హత: ఇంటర్/ డిగ్రీ/ PG. ✆ 8367678367, 8367578367 [G-787467]
■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, హైదరాబాద్ ఫోన్:9640258899, విజయవాడ:9640648899 [HA-590]
■ RJYలో ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు కెప్టెన్స్ & కస్టమర్ రిసీవర్స్, సెక్యూరిటీ గార్డెన్స్, క్లీనింగ్ స్టాఫ్, క్యాషియర్స్ & వెయిటర్స్ మినిమం 2 సం॥ అనుభవం గల వారు కావలెను. 96670 60588 [R-6137]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ /ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు నుండి ఆపైన సంపాదించే అవకాశం. Cont 88854 86421 [G-751662]
■ పర్మినెంట్ ఉద్యోగ అవకాశం : 10th, Inter చదివిన 25 సం॥లోపు యువతీ / యువకులు కావలెను. రూం ఫ్రీ. ట్రైనింగ్ తరువాత 15,000/- to 50,000/. ఫోన్ : 83742 33499, 94942 66782 [V-5923]
■ రాజమండ్రి Computer ట్రైనింగ్ సెంటర్ నందు Tally, M.S.Office, Python, Java, Web Development, Digital Marketing faculties కావలెను. జీతం: 15 వేలు ఆపైన సంప్రదించండి: 96667 72489 [P-772902]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.